56

# గుడ్ మార్నింగ్

"హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రైట్ టైమ్‌కే వస్తుందా, లేటా అండి ?"

"రైట్ టైం."

ఇది శుభసూచకంగానే వుంది. తను రైట్ టైంకే వెడుతున్నాడు, రామ్మూర్తికి కొంచెం హుషారుగా వుంది, చేతిలో బ్రీఫ్‌కేస్ ఊపుకుంటూ ప్లాట్‌ఫారం మీదికి వచ్చాడు. మెర్క్యూరీ లైట్లు చిమ్మచీకట్లని తరిమి వెయ్యడానికి ప్రయత్నిస్తున్నాయి. రామ్మూర్తి తలెత్తి ఆకాశంలోకి చూశాడు. బంగాళాఖాతంలాంటి చీకటి. ఏదో వింత అనుభూతి కలిగిందతనికి. ఎంత ఫ్లోరెసెంట్ దీపాలు వెలుగుతున్నా, రాత్రి రాత్రే, పగలు పగలే! భక్తి సంగతి ఎలా వున్నా, ఏదో కృతజ్ఞతతో "ప్రణతోస్మి దివాకరం" అనుకొన్నాడు. గంట గణగణ మోగింది. "మద్రాస్‌నించి హైదరాబాద్ వెళ్ళే ఎక్స్‌ప్రెస్ మరికొన్ని నిమిషాల్లో ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం మీదికి వస్తుంది" ప్రకటన.

రామ్మూర్తి రిస్ట్‌వాచ్ చూసుకున్నాడు. పదవుతోంది. ట్రెయిన్ వచ్చే టైమవుతోందన్నమాట. పట్టాలవైపు చూశాడు. జీవితం రైలు లాంటిది కాదు. స్కూటర్ లాంటిది ! జాగ్రత్తగా డ్రైవ్ చేయాలి.

రైలు దడదడ వచ్చేసింది. హైదరాబాద్ వెళ్ళడం రామ్మూర్తికి అదే మొదటి సారి. ఫస్ట్‌క్లాస్ ప్రయాణం కూడా అదే మొదటిసారి. అతనికి కొంచెం సంభ్రమం కలిగింది. జీవితం సెకండ్ క్లాస్ ప్రయాణమే కాని ఫస్ట్‌క్లాస్ ప్రయాణం కాదు.

బెర్త్ రిజర్వ్ చేసుకున్న కంపార్టుమెంట్ వెతుక్కొని రామ్మూర్తి రైలెక్కి తన బెర్త్ వున్న కూపే దగ్గరికి వెళ్ళాడు. తలుపు కొద్దిగా తెరిచి వుంది. లాగాడు, వెంటనే గతుక్కుమన్నాడు. బెర్త్‌మీద ఎవరో ఒక అమ్మాయి పుస్తకం చదువుతూ కనిపించింది. క్షణం తటపటాయించి తలుపేశాడు. దూరంలో కండక్టర్ కనిపించాడు. దగ్గిరికి వెళ్ళాడు.

"సార్, నా కూపేలో ఎవరో లేడీస్ వున్నట్టున్నారు. ఇంకో బెర్త్ ఇస్తారా ?"

"సారీ, వీల్లేదండీ !"

చేసేదిలేక రామ్మూర్తి మళ్ళీ వెనక్కి వచ్చి, తలుపుతోసి బ్రీఫ్ కేస్ రెండో బెర్త్ మీద పడేశాడు. తను గతుక్కుమన్నట్టే ఆ అమ్మాయీ గతుక్కుమందని కని పెట్టాడు.

"సారీ"— అని అందామనుకున్నాడు. కాని అనలేదు.

రామ్మూర్తి కొంచెం ఇబ్బందిగా ఫీలవుతున్నట్టుగా బెర్త్ మీద కూర్చున్నాడు. ఎదురు బెర్త్ మీద వున్న ఆ అమ్మాయి అవసరం లేకపోయినా కొంచెం సర్దుకు కూర్చుంది. రామ్మూర్తి బ్రీఫ్ కేస్ తెరచి ఓ దుప్పటి తీసి బెర్త్ మీద వేసి, ఓ పుస్తకం తీసి చదవసాగాడు. ఆమె ఓసారి కళ్ళ చివర్లోంచి చూసి మళ్ళీ చదవడంలో నిమగ్నమయింది. రైలు వేగంగా పోతోంది.

ఆమె ఎవరో, ఎక్కడికి పోతోందో, ఎందుకో ? తలెత్తి చప్పున ఓసారి ఆమెని నఖశిఖపర్యంతం చూశాడు. మళ్ళీ బుద్ధిమంతుడిలా పుస్తకంలోకి చూస్తూ చదవడానికి ప్రయత్నించాడు. విషయం బుర్రలోకి ఎక్కడం లేదు. ఆమె బాగుంది. ఆకర్షణీయమైన విగ్రహం, ఏం అయితే? ఆమె ఎలా ఉంటే తనకేం ? ఎదురు బెర్తు మీద వుంది కనుక చూశాడు. ఏం చూస్తే ? బాగుంది కనుక బాగుందనుకున్నాడు. ఏం అనుకొంటే? ఆమె కదిలింది. గాజుల చప్పుడైంది. ఆ శబ్దం మధురంగా వుందని పించింది రామ్మూర్తికి. ఆ శబ్దం జోలి తనకెందుకు? ఎలా వుంటే యేం ? శబ్దం విని పించింది కనుక విన్నాడు. బాగుంది కనుక బాగుందనుకున్నాడు. ఏం అనుకొంటే ? 'రమ్యాణి వీక్ష్య....' అసలా కాళిదాసు? అందమైన వాటిని చూసి, మధురమైన శబ్దాలు విని సుఖంగా వున్నవాడు కూడా పర్యుత్సుకుడవుతాడు! అయి అనుకోకుండానే జన నాంతర సౌహృదాలను తలచుకుంటాడట!

ఈమెకీ తనకీ ఏమైనా జన్మాంతర సంబంధం వుండి వుంటుందా? ఏమిటి ఆలో చనలు తనకి ? జన్మాంతర సంబంధం ఏమిటి ? చింతకాయ పచ్చడి! ఫ్రాయిడ్ చెప్పలా? ఆమె స్త్రీ తను పురుషుడు, అందుకే ఆలోచిస్తున్నాడు. రామ్మూర్తికి చప్పున కొంచెం భయం వేసింది. "తస్మాత్ జాగ్రత జాగ్రత" అనుకున్నాడు. అనుకుంటూనే ఆమెవైపు మళ్ళీ చూశాడు- అదే సమయంలో ఆమె సుతారంగా లేచి నిలబడి పయ్యెద బిగించి అతనివైపు చూసి చప్పున చూపులు మరలించి బెర్త్ మీద దుప్పటి పరచుకొంది. "నిజంగా బాగుంది" అనుకొన్నాడు రామ్మూర్తి. ఏమిటి బాగుంది ?

రూపమా, యవ్వనమా, రెండూనా? రెండు కలిస్తేనా? యాధాలాపంగా ఆమె తనవైపు చూసింది, తనూ చూశాడు. ఆమె ఏమనుకుందో? "ఏమండీ మీరెందాకా?" అని అడిగితే? నోటిదాకా ఆ మాటలు వచ్చాయి. కాని రామ్మూర్తి అడగలేదు. ఆమె బెర్తు మీద పడుకోడానికి సన్నాహపడుతోంది. "ఏమండీ పడుకొంటారా, ఈ లైట్ తీసేసి నైట్ లాంప్ వేసేనా?" అందామనుకొన్నాడు రామ్మూర్తి. ఆమె ఏమనుకుంటుందో! అయినా అడుగుదామనే ఆమెవైపు చూశాడు. ఆమె చురచుర చూస్తున్నట్టనిపించింది. ఆ ప్రయత్నం మానుకున్నాడు.

"ఏమండీ. నాకేం దురుద్దేశాలు లేవు, హాయిగా నిద్రపొండి" అంటే? అమ్మో! ఆమె ఫైరయిపోవచ్చు. ఎక్కడో చదివాడు అచేతనంలోని భయం ఆడవాళ్ళని మాటల దౌర్జన్యానికి పురికొల్పుతుందట! అసలామెకి భయం ఎందుకుండాలి? ఎందుకుండ కూడదు? ఆమె స్త్రీ, తను పురుషుడు. ఆమె ఎవరో, తనెవరో! ఎవరి పుట్టుపూర్వోత్తరాలు ఏమిటో? ఎవరి గుణగణాలు ఏమిటో? తనకి సంస్కృతి వుంది. కాని ఆమెకి అది ఎలా తెలుస్తుంది? ఆమెతో ఏమీ అనకుండా పుస్తకం మూసేసి లైట్ అలాగే వుంచి ముసుగుతన్ని పడుకోవడమే కర్తవ్యం అనుకున్నాడు రామ్మూర్తి. ఆ పని చెయ్యబోతూ, మళ్ళీ ఆమెవైపు చూశాడు. ఆమె దుప్పటి కప్పుకుని కొంచెం బెదురుగా చాటుగా అతనివైపు చూసి అటు తిరిగింది.

ఒక్కక్షణం రామ్మూర్తి మనసు చలించింది. ఆ భంగిమ బాగుంది. బాగుండడ మేమిటి. తనలో విద్యుత్తును ఛార్జి చేసింది చేస్తే చేసింది! స్కూటర్ డ్రైవ్ చేస్తున్నప్పుడు చాలా అందాలను చూశాడు, చలించాడా? తను పెద్దమనిషి! "ఏమండోయ్, ఏమిటి అలా చూస్తారు? రామ్మూర్తి ఎంతటి పెద్దమనిషో మీకు తెలియదల్లే వుంది చూడండి" అన్నట్టు రామ్మూర్తి అటువైపు తిరిగి దుప్పటి పైకి లాక్కుని పడుకున్నాడు.

అయితే ఆమె ఆ దృశ్యం చూసిందో లేదో అతనికి తెలియదు. నిజానికి ఆమె చూడలేదు. తనవైపే తిరిగి స్వేచ్ఛగా చూస్తూ ఉంటాడు. ఎందుకలా అన్ని సార్లు తనవైపు చూస్తాడు? ఏమిటి అతని ఉద్దేశం? అసలా వాలకం ఏమిటి? హిప్పీలా ఆ గిరజాలు, సైడ్‌బరన్స్. ఉలుకు పలుకూ లేదు, నోరు తెరచుకు చూడటమే చూడటం. అసలా పుస్తక మేం పుస్తకం? ప్రేమ వెన్నెలట! తను చూడాలనేనా అలా తనకి కనిపించేట్టు పుస్తకం పట్టుకోడం? ఏమిటా పోజు? మర్యాదా మట్టూ లేదు. ఏం, ఇంకోచోట కాళీ ఉందేమో చూసిపోకూడదూ? లైటు తీసి నైట్‌లాంప్ వెయ్యడేం?

ఎందుకేస్తాడు, లైట్లో శరీరం తూట్లుపడేట్లు చూడొద్దూ? ఛీ, ఇతనెక్కడ దాపురించాడు? సంస్కారం బొత్తిగా ఉన్నట్టులేదు. ఏ అర్ధరాత్రో కొంపదీసి ఏ అఘాయిత్యమో చెయ్యడుకద ! ఆమెకి ముచ్చెమటలు పోశాయి. అమ్మో, నిద్రపోకూడదు. ఎలా ? అరిచినా ఎవరికీ వినపడదు. పోనీ కూర్చొంటే ! 'నీ పెద్దమనిషితరహా మీద నాకు నమ్మకం లేదు' అని ముఖం మీద చెప్పటమేగా ! అతనికి సంస్కారం, సభ్యత ఉన్నా లేకపోయినా తనకున్నాయి. హైదరాబాద్ దాకా వదలడా? ఏ వరంగల్లోనో దిగిపోతాడా ? చూస్తే హైదరాబాద్ లాగుంది. అక్కడేం వెలగబెట్టాలో ? అబ్బ, కళ్లు కూరుకుపోతున్నాయి. కన్నుమూస్తే ఇంకేమన్నా వుందా, ఏం దౌర్జన్యం చేస్తాడో?

ఆమెకి మాగన్ను పట్టింది. ఏవేవో పిచ్చికలలు. ఎవడో ముసుగు మనిషి తలుపులు దఢాలున తోసి లోపలికొచ్చి తనని నెట్టేసి ఏదో దొంగిలించుకు పోతున్నాడు. అడ్డొస్తే కత్తితీసి బెదిరించి పొడవబోతున్నాడు.

"అమ్మో!"

ఆమె పొలికేకపెట్టి లేచింది. అటు తిరిగి పడుకున్న రామ్మూర్తి ఉలిక్కిపడి లేచాడు. ఆమె వగరుస్తోంది.

"ఏమైంది ఏమైంది ?"

ఆమెకి నోట మాట రాలేదు. అలాగే అతనివైపు చూడసాగింది. నుదురుమీద స్వేదబిందువులు చేరాయి.

"ఏమైనా కలొచ్చిందా ?"

"దొంగ-దొంగ........" గొణుగుతూ అందామె.

"దొంగా ! తలుపులు వేసే ఉన్నాయిగా. దొంగ ఎలా వస్తాడు?"

"తలుపులు తోసుకొచ్చి నేను అడ్డొస్తే కత్తితీసి పొడవబోయాడండీ"అందామె రైలుపెట్టె అంతా కలయచూస్తూ.

"పీడకల వచ్చి ఉంటుంది. దొంగెలా వస్తాడు? వస్తే మాత్రం నేను లేనా ? నాకు కరాటే వచ్చు. రాస్కెల్ని మూడు చెరువుల నీళ్లు తాగిస్తా. మీకేం భయం లేదు. ఏమిటలా వొణికిపోతున్నారు. ఛలేవారే మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు. పడుకొని హాయిగా నిద్రపొండి."

ఆమె అతనివైపు తదేకంగా చూసింది. ఆమెలో ఏదో విశ్వాసం జనించసాగింది. ఎంత హుందాగా అభయమిస్తున్నాడు! కరాటే కూడా వచ్చుట ! మాటల్లో

పెద్దమనిషి తరహా ఉట్టిపడుతోంది. పాపం ఇతన్ని గురించి అనవసరంగా ఏమేమో అనుకుంది, ఉట్టి పుణ్యానికి భయపడింది. మర్యాదగా అటు తిరిగి పడుకొనే వున్నాడు. లేనిపోనివి ఊహించుకొంది. ఆమె పశ్చాత్తాపంతో తల దించుకుంది. వదనంలో కృతజ్ఞత వెల్లివిరిసింది.

"థాంక్సండీ."

"ఎందుకు థాంక్స్, భలేవారేనే పడుకోండి."

ఇంక ఆమె మాటలకు ఎదురుచూడకుండా రామ్మూర్తి మళ్ళీ అటు తిరిగి పడుకొన్నాడు. ఆమెకూడా పడుకొంది. ఆమెకి నిశ్చింతగా ఉంది, త్వరలోనే నిద్రపట్టింది. ఏవేవో కలలు, రంగు రంగుల ఇంద్ర ధనుస్సులు, తెలి మబ్బులు,పరిమళాలు వెదజల్లే పువ్వులు, నవ్వులు, కేరింతలు, అలల మీద తేలిపోయే హంసలు, కోయిల పాటలు. చిలకల, గోరింకల రొదలు.

రామ్మూర్తి పడుకొన్నా ఒక పట్టాన నిద్ర పట్టడం లేదు. కలలు కల్లలు కావు. ఏమిటీ ? ఆమె కల అర్థం స్పష్టంగా తెలుస్తూ వుంది. ఆమె వయసులో ఉంది. మనసులో కోరిక ఉంది. కోరికల ప్రచ్ఛన్న తృప్తే కలల అంతరార్థం కదా ! ఆమె అభిప్రాయం ఏమిటో? దేన్ని గురించి?అదే తను దౌర్జన్యం చేస్తాడని ఆమెఅనుకొందా, భయపడ్డదా లేక దౌర్జన్యం అంతరాంతరాల్లో ఆమెకి ఇష్టమా ? ఛీ! ఏమిటిలా ఆలోచిస్తున్నాడు తను ? ఆమె ఏమనుకుంటే తనకేం ? ఆయినా మానవ సంబంధాల్ని గురించి ఆమె అభిప్రాయమేమిటో ? సెక్సును ఆమె తేలిగ్గా తీసుకుంటుందా ? రామ్మూర్తికి తను జారుడు ప్రదేశంలోఅడుగు పెడుతున్నాడని తటాలున అనిపించింది. ఛీ ! తన సంస్కారం ఏమవుతున్నది ? ప్రవరాఖ్యుడు ఏమన్నాడు? "ఒడల్ తిరమే, చెప్పకు మిట్టి తుచ్ఛ సుఖముల్ మీసాలపై తేనియల్."

రామ్మూర్తి ఒంట్లు లెక్కపెట్టసాగాడు. మాగన్ను పట్టింది. చంద్రుడు వెన్నెల. ఇంతలోనే నల్లటిమబ్బులు. తుపాను, ఎవరో తడిసిపోయి వణికిపోతోంది. తను పొడి బట్టలు ఇచ్చాడు, ఆమె కట్టుకుంటోంది. ఆమె బాగుంది. ఆకర్షణీయంగా ఉంది. అనుకోకుండా పెనుగులాట-ఆమె పరిగెత్తుతుంది. తనూ పరిగెత్తుతున్నాడు. ఆమెని అందుకున్నాడు, ఆమె తోసేసింది-

"అబ్బా"

ఆమె ఉలిక్కిపడి లేచింది. అతను బెర్తుమీంచి కిందికి దొర్లిపడి తల తడుముకుంటున్నాడు. ఆమెకి నవ్వు వచ్చింది, ఆపుకోలేకపోయింది.

"ఏమిటండీ. చిన్న పిల్లాడిలా బెర్తుమీద నుంచి దొర్లారా." నవ్వింది! అతను సిగ్గుపడ్డాడు. అయినా నవ్వూ వచ్చింది. నవ్వాడు.

"అలవాటు లేదు కాబోలు" అందామె.

"లేదండీ" అన్నాడు లేచి బెర్తుమీద కూర్చొంటూ. ఛీ! ఏమిటి పాడు కల! "హైద్రాబాద్ వెళ్తున్నారా?" మృదువుగా అడిగాడు.

"అవునండీ. మీరూ హైద్రాబాదేనా?"

"అవునండీ-యూనియన్ బ్యాంక్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్ట్‌కి ఇంటర్వ్యూకు వెడుతున్నాను. ఫస్ట్‌క్లాస్ చార్జీ ఇస్తామంటే పోనీ సరదాగా ఇంటర్వ్యూకి వెళ్ళొద్దామని బయల్దేరాను. సిఫారసు లేంది ఇలాంటి ఉద్యోగాలు రావుట" రామ్మూర్తి ఆశ్చర్యంగా ఆమెవైపు చూశాడు.

"నేనూ అక్కడికే-తమషాగా కలిశాం. మీ పేరు?"

"శారద"

"నా పేరు రామ్మూర్తండి"

"గ్లాడ్ టు మీట్ యూ."

"వెరీ గ్లాడ్ టు మీట్ యూ! విష్ యూ గుడ్‌లక్."

"థాంక్స్-ఆల్ ది బెస్ట్."

ఇంక ఆ రాత్రి ఎవరికీ ఏ కలలు రాలేదు. "కాఫీ కాఫీ" అనే కేకలు వినిపించి రామ్మూర్తి కళ్ళు నులుముకుంటూ లేచాడు. సరిగా అప్పుడే ఆమెకూడా కళ్ళు నులుముకుంటూ లేచింది.

"గుడ్‌మార్నింగ్ శారదగారూ" అన్నాడు రామ్మూర్తి చిరునవ్వుతో.

"వెరీ గుడ్‌మార్నింగండీ" అందామె మందహాసం చేస్తూ.

జననాంతర సౌహృద మేదో ఇద్దరి మనసుల్లోను మెదిలింది.

[ఆంధ్రజ్యోతి 1980 ఏప్రిల్ 20]